# అచలపతీ - తెలుగుతండ్రీ

**వ**స్తూనే ఇంగ్లీషులో సంభాషణ మొదలుపెట్టడంతో ఆయన తెలుగువాడని సులభంగా పోల్చుకోగలిగాను. కానీ నాలుగైదు వాక్యాల తర్వాత కూడా 'అయామ్ నాట్ గివింగ్ ట్రబుల్ కదండీ' వంటి ప్రయోగాలు కనబడకపోతే సందేహం కలిగింది – కాదేమోనని. పరిచయం పూర్తవగానే గొప్ప రహస్యం చెబుతానన్నాడు. కానివ్వమన్నాను. బగ్గింగ్ ఎక్విప్‌మెంట్ ఉందేమో పరీక్షిస్తానని సోఫాలూ, ఫ్లవర్‌వాజ్‌లూ వెతకనారంభించాడు. చాటుగా వినడానికీ, నల్లికీ ఇంగ్లీషువాడు ఎలా ముడిపెట్టాడాని ఆలోచిస్తూండగానే, చెప్పబోయే రహస్యం బయటపెట్టబోనంటూ తాత ముత్తాతలపై పేరు పేరునా నా చేత ప్రమాణాలు చేయించేశాడు. ఈయనే బేతాళుడయ్యుంటే విక్రమార్కుడు హడిలిపోయి సమాధానం తెలీకపోయినా నోరు విప్పేసేవాడు.

చివరికి చెవిలో చెప్పాడు – ఆయన తెలుగువాడుట! ఆయన భార్య కూడా తెలుగమ్మాయేనట!

పొరుగింటి పుల్లకూర – గర్భిణులకే కాదు లోకులందరికీ రుచే ననుకుంటా. అందుకే తెలుగు రచయితలు తమ నవలల్లో ఇంగ్లీషు వాక్యాలు, ఇంగ్లీషు వాళ్లు ఫ్రెంచి వాక్యాలు, ఫ్రెంచి వాళ్లు మరో భాష.. ఉపయోగిస్తారు కాబోలు. కాస్త అసింటా ఉన్న ఇంగ్లాండును పొరిగిల్లు చేసుకున్నారు ఈ దంపతులు. అబ్బాయి పుట్టేటప్పటికే వీళ్లకి సిరి ఎత్తుకోవడం వల్ల ఇంగ్లీషువాళ్లలా చలామణీ అయ్యే సౌలభ్యం కలిగిందట.

కుర్రవాడికి తను తెలుగువాడినని తెలీకుండా, తెలుగు గాలి తగలకుండా, తెల్లవాళ్లలోకం నుండి దిగొచ్చినవాళ్లమనే నూరిపోసారట. దానికై ఆయన పద్ద

ప్రయాస వింటే భోరుమనాలనిపించింది. చుట్టాల్ని, పక్కాల్ని చుట్టుపక్కలక్కూడా రానివ్వలేదుట. వారానికొకసారి శరీరమంతా బ్లీచ్ చేయించుకొని, నల్లభాగాలన్నీ వదిలించుకొన్నారట. ఇంట్లో బట్లర్లు, ఫుట్‌మన్లు, వాలేలు, గవర్నెస్‌లు, అందరూ ఇంపోర్టెడ్ సరుకేట. ఊళ్లో చలేయక పోయినా ఓ ఫైర్ ప్లేసూ, ఆ చేత్తోనే ఓ పియానో అన్నీ ఏర్పాటు చేసారట. పిల్లవాడి చదువంతా ఇంట్లోనే దొరల ద్వారా చెప్పించాడట. ఇల్లంతా గాలించినా తెలుగు పుస్తకం ఉండదట. పంచాంగం కూడా ఇంగ్లీషేట. కుర్రాడికి కోపం వస్తే




నాలుగక్షరాల ఇంగ్లీషు మాటలనే (అదే భావాన్ని తెలుగులో రెండక్షరాలలోనే వెలిబుచ్చగలమని తెలిసి కూడా) వాడమనేవాడట.

సమస్య ఏమిటో తెలియలేదు నాకు. సంపాదించినంత కాలం స్వదేశాన్ని తిట్టి పెళ్లిసంబంధాలకు మాత్రం మాతృదేశం వైపు చూపుసారించే విదేశాంధ్రుల్లా ఈయన తెలుగు కోడలి కోసం వెతుకుతున్నాడా? అడిగి చూశాను. అది కాదుట సమస్య. తెలుగు గాలి తగలకుండా పెరిగిన బిడ్డకి ఓ సారి ఘంటసాల పాట గాలిలో తేలుతూ వినబడిందట. 'ఈ భాషేదో మధురంగా వుంది, నేర్చుకుంటా'నన్నాడట. మిత్రబృందం కూడా విదేశవాళీ సరుకే కాబట్టి ఆ భాష భోగట్టా చెప్పలేకపోయారట.

తల్లితండ్రుల నడిగేడట. తన కొడుక్కి ఆడగాలి తగిలినప్పుడు ఋష్యశృంగుడి తండ్రి పడ్డ క్షోభ ఈయన అనుభవించి, ఇకపై ఏ గాలీ తగలకుండా కిటికీలన్నింటినీ మూయించేసాడట. ఈఎన్‌టీ స్పెషలిస్టుల చేత చెవిలో ఘంటసాల పాటను తీయించే ప్రయత్నం చేశాడట. అది ఆ పాటికే అతని మనస్సులో తిష్టవేసి, లోపలంతా మార్మోగి పోతోందిట. ఈ భాష సంగతేమిటో తేల్చుకుంటానని పంతం పట్టాడట

కొడుకు.

'ఇదండీ సమస్య' అని ఆగాడాయన. దేవుడు ప్రత్యక్షమైతే దండకం చదివిన తర్వాతే డిమాండ్లు బయటపెట్టాలని తెలీని అమాయక భక్తుడికేసి దేవుడు చూసినట్లు, ఓ చూపు పారేసి 'అసలు నేను సమస్యలన్నీ తీరుస్తానని ఎవరు చెప్పారు?' అన్నాను.

"సుబ్బుగారు చెప్పారు. మీ సలహాపైనే అల్లపు సబ్బులు తయారు చేసే ఫ్యాక్టరీ పెట్టారటగా", (ఈయన కథలో మొదటిభాగమే విన్నాడన్నమాట) అన్నాడాయన.

మన మీద గౌరవం ఉన్న ప్రాణులు క్రమంగా అంతరించిపోయి 'క్లాసిఫైడ్ స్పీసీస్'గా ప్రకటించబోయే ఈ తరుణంలో ఈ వార్త మనసుకి చల్లగా తోచినా పైకి మాత్రం, "బైదిబై ఇతను అచలపతి అని నా అసిస్టెంటు. చాలా తెలివైనవాడనీ, మంచి సలహాలిస్తాడనీ జనాలు అంటూంటారు. నా బదులు మీరతన్ని సలహా అడిగినా నేనేమీ అనుకోను ' అన్నాను రాముడికి పట్టాభిషేకం చేసిచూడమని సూచించిన భరతుడిలా.

'అబ్బే మీరుండగా అసిస్టెంట్ల జోలి నాకేల?' అన్నాడు ఇట్లు తమ విధేయుడు.

నెత్తిమీద ఆపిల్ పండు పడగానే 'ఇదేదో మన మంచికే వచ్చినట్టుంది' అనుకుని ఎగిరి గంతేసిన న్యూటన్‌లా సంతోషించినా, పైకి మాత్రం తాపీగా 'సరే ఇంతకీ మీ అబ్బాయి తెలుగు మీద దృష్టి సారించడమే మీ సమస్యంటారు" అన్నాను.

అన్నాక కాస్సేపు 'పండిత జవహర్‌లాల్ నెహ్రూ' అన్న పటంలో నెహ్రూలా గడ్డం కింద పిడికిలి నిలబెట్టినట్టు ఆలోచించి "మీ వాడు ఫ్రెంచీ గించీ నేర్చినట్టుగానే తెలుగు నేర్చుకోనివ్వండి. అతని కుళ్లాయిలో మరొక తురాయిలా ఉంటుంది. బైదిబై ఫెదర్ ఇన్ ది కాప్‌ని ఎలా తెలుగు చేశానో చూసారా ?" అన్నాను.

ఆయన ఎంత మాత్రం ముగ్ధుడవలేదు. "మీరు ఒక విషయం మర్చిపోతున్నారు. ఏ గ్రీకో, లాటినో నేర్చుకున్నా ఫర్వాలేదు. తెలుగు నేర్చుకొంటే మేం ఎప్పుడైన తప్పిదారి తెలుగు మాట్లాడితే, మా మాతృభాష తెలుగు అని తెలిసిపోతుంది కదా వాడికి. మేం జాగ్రత్తగానే ఉంటాం. హఠాత్తుగా దెబ్బ తగిలినా 'అమ్మా, అబ్బా' అనకుండా 'ఓ మదర్ ఓ ఫాదర్' అనే ప్రాక్టీసు చేశాం. అయినా ఏ క్షణమైనా ఆదమరిస్తే... ? అదీ నా సమస్య" అన్నాడతను.

నా వంటి మసిపూసిన మాణిక్యాన్ని పసిగట్టి గలిగిన ఈ ప్రజ్ఞానిధిపట్ల కరుణానిధి

కావల్సినదే!  ఆయన్ను నిరాశపరచకుండా వాళ్ల అబ్బాయి తెలుగు బారి పడకుండా రక్షిద్దామనే నిశ్చయించుకొన్నాను.

హిరోషిమా మీద ఆటంబాంబు వేయబోయే ముందు పైలట్లా తటపటాయించి 'పోనీ మీ వాడిని హైద్రాబాదు టి.వి.కి గురిచేస్తే?' అన్నాను కడుపుతీపి చేత వద్దంటాడని సంశయిస్తూ.

మంచి పౌరుడి శిక్షణలో శిక్ష ఒక భాగమని నమ్మడంలో ఈయన ప్రహ్లాదుడి బాబు హిరణ్యకశిపుడికి బాబులా ఉన్నాడు. 'నాకభ్యంతరం లేదు. నేనెప్పుడూ చూడలేదు కానీ అవి చూస్తే తెలుగు మీద విరక్తి కలుగుతుందంటారు. కానీ వచ్చిన చావేమిటంటే మా టీ.వీ.కి అన్నీ ఫారిన్ కనక్షన్లే! ఈ టీవీ ప్రోగ్రాములు చూపించటం ఎలా ?' అన్నాడు.

'మనసుంటే మార్గముండదా?' అని స్ఫురించేట్లు నవ్వి ' ఏదైనా వీడియో షాపులో హైద్రాబాదు టీవీ కార్యక్రమాలు రికార్డు చేయించి వీడియో చూపించండి మీ వాడికి' అన్నాను.

'పోయి పోయి హైద్రాబాదు టీవీ ప్రోగ్రాంలు రికార్డు చేయమంటే పిచ్చాడనుకొని షాపువాడు నన్ను పోలీసులకు అప్పజెబితే?'

హిరణ్యకశిపుడికి ఈ పాటి ఆలోచన ఉంటే సంధ్య వేళ దాటిం తర్వాతే స్తంభం పగులగొట్టుండేవాడు.

'పోనీ మీ సెక్రటరీని పంపండి. లాకప్పులో ఉన్నంత కాలం ఓవర్ టైమ్ ఇవ్వండి."

'రైట్ అలాగే చేద్దాం . కానీ రోజు కెన్ని గంటలు చూపించమంటారు?'

'నాలుగు గంటలు చాలు, ఓ వారం చూసి ఫలితం పెద్దగా లేకపోతే పొటెన్సీ మార్చండి'.

'రైట్, థాంక్యూ'.

పద్మశ్రీ అవార్డు అందుకొని, చంక నెట్టుకుని, వేదిక దిగివెళ్లిపోకుండా మైకు దగ్గర నాలుగు వాక్యాలు చెప్పవలసిన అగత్యం, ఔచిత్యం తెలిసినవాడిని కాబట్టి అచలపతితో "భగవాన్‌కే ఘర్‌మే దూర్ హై, అంగూర్ నహీ' అంటారు చూడు. జనాల పుణ్యం ఇన్నాళ్లకి పుచ్చి నా సలహాల విలువ గుర్తిస్తున్నారు" అన్నాను.

"భగవాన్‌కీ ఘర్ మే దేర్ హై, అంధేర్ నహీ అంటారండి కొందరు".

'బర్డన్ ఆఫ్ ది స్టేట్‌మెంట్' అయిన 'జనాల పుణ్యం' గురించి ఔననో కాదనో

చెప్పకుండా నా హిందీ గురించి మాట్లాడటం విసుగేసినా పైకి మాత్రం "హిందీ పాటల్ని తెలుగు లిపి ద్వారా చదువుకొని పాడుకొన్నవాణ్ణి. నా హిందీ ఇంకెలా ఉంటుంది? ఎంతైనా పరాయి భాష" అన్నాను నా తప్పును తేలిక చేస్తూ.

"యస్ సర్! మహా మేధావులు కూడా మీలాగ ఆలోచించిబట్టే మాతృభాష లోనే విద్యాబోధన సాగాలంటున్నారు సర్" అంది మూర్తీభవించిన లౌక్యం.

కాంప్లిమెంటు హృదయాన్ని తట్టి మనస్సును రంజింప చేసేటంతలోనే బుర్ర కూడా అదే వేగంతో పనిచేసింది నాకు– 'ఇదేదో ట్రాప్‌లా ఉందిరోయ్' అంటూ. తమాయించుకుని, "అంటే ఈ కేసులో ఆ అబ్బాయిని తెలుగు దారిన పడి పోనివ్వాలంటావ్. అంతేనా?" అని అతని ఉద్దేశాల పర్దానషీన్ యొక్క బురఖా లాగేసాను.

అచలపతి అంత సులభంగా బయటపడతాడా? "ఒక భాష నేర్చుకుంటాననే యువకుడి దారిలో అడ్డంకులు పెట్టడం అంత సబబు కాదేమో ఆలోచించి చూడమని విన్నపం చేస్తున్నాను సర్. భాష నేర్చుకుని తెలుగువాడని తెలుసుకున్నంత మాత్రాన ఉపద్రవం జరుగుతుందని తల్లిదండ్రులు తల్లడిల్లడం సహజత్వానికి దూరంగా ఉందని అనుకోవడానికి అవకాశం ఉంది సర్".

అయిదునిమిషాలకు వాక్యాల అర్థం పూర్తిగా బోధపడ్డాక, నా వాదనను బయటపెట్టాను – ''అతని తల్లిదండ్రులు తమ మాతృభాష మార్చుకొందామనుకోవడంలో తప్పేముంది? లోకులు మతం మార్చుకుంటున్నారు. అటువంటప్పుడు మాతృభాష మార్చుకోవాలను కోవడం ఏమాత్రం దూషణీయం కాదు. 'మార్పు నా జన్మహక్కు' అన్నాడు తిలక్".

"సర్ , చిన్న సవరణ"

"తెలుసు, తిలక్ అనకూడదు టిళక్ అనాలి. మరాఠీలో అదే అతని పేరు అంటావ్. ఇది వరకోసారి చెప్పావు. కానీ తెలుగు వాళ్లంతా 'తిలక్' అనే అంటారు. చూశావుగా తెలుగులో ఎన్ని కొరతలో ".

"కానీ వారి అబ్బాయి మార్చుకుందామనుకుంటున్నాడో లేదో మనకు తెలీదు కదాసర్! అతనికి నిజం తెలియకుండా దాచడం.."

"సెక్షన్ ఫలానా, సబ్‌సెక్షన్ ఫలానా, బ్రాకెట్లో ఫలానా ప్రకారం నేరం అంటావా? నువ్వొక మతం ఆచరిస్తుంటే మీ పిల్లాడు మరో మతాచారాలు ఇంట్లో

ప్రవేశపెడితే సహిస్తావా? నువ్వు నమ్మిన బాటనే వాడినీ తీసుకెళదామని అనుకొంటావు. నా బోటివాళ్ల సాయం కోరతావు, పొందుతావు, విజయం సాధిస్తావు".

"మీ విజయోత్సవంలో పాల్గొనే అవకాశం నాకు కలగకపోవచ్చు సర్. నేను ఒక నెల్లాళ్ళపాటు సెలవు మీద వెళదామనుకుంటున్నాను. మా మేనకోడలి పెళ్లి ఉంది".

కానీ నేను సెలవివ్వడానికి ఒప్పుకోలేదు. అతను దగ్గర లేకపోతే ముస్సోలినీ బెదరలేని హిట్లర్ లాగ నిశ్చింతగా ఉండవచ్చు గానీ అచలపతి ప్రాంప్టింగ్ లేకుండా ప్రపంచ వేదికపై నెల్లాళ్ళు తిరుగాడాలంటే సభాపంకమో సభా కంపరమో అలాంటిదేదో కలుగుతుంది. అందుచేత ఇలా నవ్వేసి –

"మన బ్రహ్మచారులకు పెళ్లిళ్లతో పనేమిటోయ్! సెలవు ఇవ్వబోయేది లేదు" అనేసాను. అంతే కాకుండా జవాబుగా అతను గొంతు సవరించుకోబోయే ప్రయత్నాన్ని ఆదిలోనే పసిగట్టి ఖరాఖండీగా చెప్పేశాను.

"దటీజ్లాస్టండ్ఫైనల్డెసిషన్" అని.

❖ ❖ ❖

శ్రీనాథుని చాటు పద్యాలు స్కూల్లో చదివినప్పుడు పల్నాటి టూరునుండి తిరిగొచ్చాక అతని మొహం ఎలా ఉండి ఉంటుందో ఊహించే ప్రయత్నం చేసాను కానీ అది నా మనస్సులో సరిగ్గా రూపుకట్టుకోలేదు.

కానీ ఆ రోజు తెలుగుతండ్రి మొహం చూడగానే మనస్సు ఘోషించింది. – ఆ రూపు ఇదే ఇదే నంటూ.

తెలుగు తెగుల్ని వదుల్చుకొందామనుకొంటున్నా ఆయన తన భాషా పాండిత్యాన్ని చాలాభాగం అట్టే పెట్టుకున్నాడు లాగుంది. అవాళ తెలుగులోనే మాట్లాడేడు –మనసారా కసితీరా బూతులు తిట్టడానికి మాతృభాషే మంచి సాధనమేమో! ఆయన ఉపన్యాసం యొక్క శానిటైజ్డ్ వెర్షన్ –పరిష్కృత ప్రతి ఇది – ' హైద్రాబాదు టీ.వీ. వాళ్ళు ఏ పనీ సరిగ్గా లక్షణంగా చేయలేరట. తెలుగు తగలెయ్యడం కూడా సరిగ్గా రాదట. వాళ్లు తెలుగు మాటలతో ఆడిన దోబూచులు వాళ్లబ్బాయిలో ఉత్సుకతను , వాటి అసలు స్వరూపాలను తెలుసుకోవాలన్న జిజ్ఞాసనూ రేకెత్తించాయట.

ఇంతలో నా అంతర్వాణి 'వజ్రం వజ్రేణ భిద్యతే' అంటూ సూక్తి వినిపించింది. సిగ్నల్ అందుకొన్నాను. వెంటనే పథకం వివరించాను. 'మీవాడిని ఓ తెలుగు పాటయే ఈ స్థితికి తెచ్చింది. అదే తెలుగు పాట– అప్పటిది కాదు, ఇప్పటి సినిమా

పాటలను వినిపించండి. రోగం కుదురుతుంది. తెలుగు జోలికి పోడు'.

అప్పుడప్పుడు నేను పత్రికలకి పంపే కవితల్లా పదో రోజుకల్లా మళ్లీ మా గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు తెలుగు తండ్రి. 'ఈ పాటలన్నీ ఒట్టి రొదే. వీటిలో ఏ భాషా లేదు పొమ్మన్నా'ట్ట పుత్రరత్నం. తెలుగు చదివే ప్రయత్నం కూడా చేస్తున్నాట్ట.

బుర్రకు పదును పెట్టాను. 'తెలుగుపై ఇంట్రస్టు ఎలాగూ వదలగొట్టలేకపోతున్నాం. తెలుగు సరిగ్గా నేర్చుకోకుండా చెడగొడదామని ప్రభుత్వం వారు ప్రచురించే పాఠ్యపుస్తకాలు, బాగా అచ్చుతప్పులున్నవి చూసి ఇవ్వమ'న్నాను.

ఇదీ పని చేయలేదు. పుస్తకం ప్రింటు పరమఘోరంగా ఉండి, రంగులతికేసినట్టుందిట. అక్షరాలు ఏమీ తెలియరాలేదట. పుస్తకం పనికిరాదన్జెప్పి ఓ లేడీ ట్యూటర్ని పెట్టుకుని తెలుగు నేర్చుకుంటున్నాట్ట కుర్రాడు.

తండ్రి ఓపిక హరించుకుపోతోంది.

ఇక అటునుంచీ నరుక్కురావాలనుకొన్నాను. ఒక భాష మీద మనకు ఏవగింపు ఎప్పుడు కలుగుతుంది? ఆ భాష మాట్లాడే మనుషుల మీద అసహ్యం కలిగితే అది ఆటోమేటిగ్గా భాషపై ప్రసరిస్తుంది. హిందీ సినిమా పాటల ద్వారా హిందీ నేర్చుకొనే ప్రయత్నంలో నేనుండగానే హిందీని రుద్దడం ప్రారంభించారు హిందీ ఛాందసవాదులు. తక్షణం హిందీకి ఫుల్‌స్టాపెట్టి వాళ్ల తిక్క కుదిర్చేననుకొన్నాను.

ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా అరవల 'పెద్దన్నతనం' చవి చూడడంబట్టే కాబోసు మనకు అరవ భాషపై చిన్నచూపు – అరవగోల, అరవచాకిరీ అంటూ! పాపం ఎంతో ప్రాచీనమైన భాష అది. అయినా దాని గతి మన చేతిలో అలా అయింది. తండ్రిగారికి ఈ విషయం చెప్పి మా వెంకిగాడి కథ కూడా చెప్పాను.

"వెంకి బెంగాల్లో ఉద్యోగం దొరక్కముందు బెంగాలీ భాషన్నా, బెంగాలీ మనుషులు (అందునా ఆడ) అన్నా మహామోజు. కానీ బెంగాలు వెళ్లాక చూస్తే, అవగుంఠనాలూ, పాదధూళీలతో విరాజిల్లవలసిన వంగవనితలు పనిమనుషులుగా వచ్చి అలగాజనంలా కీచులాడడంతో ఇతని మనస్సు విరిగింది. పైగా ఒక వంగ ఆడపులి 'ఒంటరిగా ఉన్నప్పుడు ఒంటి మీద చెయ్యేసేడం' టూ అన్యాయపు ఆరోపణలు చేయడంతో బెంగాలీనోళ్లలో వాడి పేరుతో బాటు, వాడి పరువు కూడా ఖూనీ అయింది. అప్పణ్నుంచి బెంగాలీ మనుషులన్నా, భాషన్నా, రొషగొల్లాలన్నా ఆమడ దూరంలో ఉంటాడు.

"అంచాత మీ వాడి లేడీ ట్యూటరుతో లోపాయికారీ ఒప్పందం పెట్టుకొని, తనే మీ




వాణ్ని వాటేసుకుని, ముద్దులాడి ఆపై కావు (ము) కావు(ము)మని గావు కేకలు వేసి యాగీ చేయమనండి. మీ వాడికి తెలుగు వనితల కుటిలత్వం, తద్వారా తెలుగు భాషపై ఏహ్యత పుట్టుకు రాకపోతే నన్నడగండి".

అడిగేడు – వారం తర్వాత కోపంగా వచ్చినప్పుడు – నాకు బుద్ధి ఉందాని. ఆ దిక్కుమాలిన (అచ్చువదగిన విశేషణం ఇదొక్కటే) ట్యూటర్ ఒప్పుకున్న ప్రకారం ముద్దిచ్చిందట. కానీ మనవాడు ఎదురు ముద్దులివ్వడంతో ప్లాను మరచి పరవశమై పోయి కరిగి నీరై పోయిందట. బయట కాసుక్కూచున్న ఈయన మనుష్యులు బుర్రలు గోక్కుని ఇంటికొచ్చేసేరట. ఆ కుర్రాడు ట్యూటర్ని పెళ్లాడదామని ఆలోచిస్తున్నాట్ట. కోడలు కూడా తెలుగుదైతే గోదారే గతన్నాడు ఈయన.

ఆయన్ని నచ్చచెప్పి పంపించేసాక అచలపతిని కదలేసేను – 'మన స్కీములో పొరపాటు ఏముందోయ్ !' అంటూ.

"మా మేనకోడలు పెళ్లికి వెళ్లలేకపోతున్న దుఃఖంలో బుర్ర సరిగ్గా పనిచేయటం లేదు సర్" అన్నాడు అచలపతి.

ఆంధ్రరాష్ట్రం కావాలంటే మద్రాసు ఇవ్వనని లింకేసిన రాజాజీ కేసి ప్రకాశంగారిలా చూసేను. కానీ ప్రకాశంగారికే తప్పలేదు. నేనెంత?

"సరేలే , లీవేనా? ఇస్తానులే. కానీ దీని సంగతి చూడు ముందు".

"థాంక్యూ సర్ – బుర్ర ఇప్పుడు కొద్దిగా పనిచేస్తోంది. మీ పద్ధతి సరిగ్గానే ఉంది కానీ ఎన్నుకొన్న పరికరాల్లో లోపం ఉన్నట్టుంది సార్! అయినా, మాతృభాష మాధుర్యం గ్రోలిన కుర్రాణ్ణి ఆర్నెల్ల కంటె దానికి దూరంగా ఉంచలేమేమో సర్!"

తిరపతి ఇవ్వకపోయినా ఫర్వాలేదన్న మూడ్‌లో ఉన్నాన్నేను. "పోనీ నెల్లాళ్లు దూరంగా ఉంచినా చాలు. మార్గం ఏదో చూడు".



"యస్ సర్"

రెండ్రోజులు పోయేక "సర్ మీరు రేపు ఉదయం పదకొండు గంటలకి తెలుగు తండ్రి ఇంటికి వెళ్ళగలరా?" అన్నాడు అచలపతి.

"నేనప్పటికి ఇంకా నిద్ర లేవను. సాయంత్రం వెళతాను".

"ఆయన భార్య పేర నేను రాసిన ఆకాశరామన్న ఉత్తరం కొరియర్ అందించే సమయానికి మీరక్కడ ఉంటే బాగుంటుందని నా అభ్యర్థన సర్".

"అలాగా! సరే, సమాజ సేవలో త్యాగాలు తప్పవు. రేపు అలారం పెట్టు. అరగంట ముందుగా లేస్తాను".

నేను వెళ్లి కూర్చున్న పదినిమిషాలకే ఉత్తరం వచ్చింది. కొడుకు కవరు అందుకొని తల్లికిచ్చాడు. ఆమె ఉత్తరం చదివి తికమకపడుతూంటే భర్త లాక్కొని చదివాడు. ఆమెకు ఒక ప్రియుడు రాసిన ఆ ఉత్తరం చదివి ఆయన ఉగ్రుడైపోయాడు. ఇక తిట్లు లంకించుకొన్నాడు, పచ్చి తెలుగులో ఆవిడ పాత రంకులన్నీ ఉతికారేశాడు. ఆవిడా తక్కువ తినలేదు అదే భాషలో, అదే బాణీలో ఆయన పురాణం విప్పింది.

కొడుకు నివ్వెరపోయి తల్లికేసి, తండ్రికేసి, తెలుగులో ఉన్న ఉత్తరం కేసి మార్చి

మార్చి చూశాడు. అతనా తర్వాత అందుకొన్నాడు. ఒక ఆకాశరామన్న ఉత్తరం చూసి ఇంతలా రెచ్చిపోవడం కుసంస్కారం అన్నాడు. తెలుగువాళ్లయుండి కూడా ఆ విషయాన్ని మరుగు పరచడం దారుణం అన్నాడు. ఈ కుసంస్కారం, ఈ మోసం, ఈ హిపాక్రసీ – తల్లికీ, తండ్రికే కాక వాళ్ల వంశాలకే ఉందన్నాడు. వాళ్ల ఊరి వాళ్లంతా ఇంతేనన్నాడు. తెలుగుజాతే ఇంతన్నాడు. ఈ జాతి మనుషులను పెళ్లి చేసుకోవడం, వారి భాష నేర్చుకోబోవడమంత బుద్ధిమాలిన పని వేరొకటి లేదన్నాడు.

V V V

అచలపతితో చిన్న తిరకాసు వేయబోయాను ఇంటికొచ్చాక.

"నీ ప్లాను పారింది కానీ పెళ్లికి వ్యవధి లేదు కదా! టిక్కెట్లు ఇప్పుడు దొరకవు కదా!"

"నెల్లాళ్ల క్రితమే టిక్కెట్లు బుక్ చేసి ఉంచాను సర్".

అంటే నేను నా ప్రయత్నాలలో ఫెయిలవుతానని, అతని సాయం కోరతాననీ లీవు గ్రాంటు చేయక తప్పని పరిస్థితి వస్తుందనీ ఊహించేడన్నమాట! ఎంత ఆత్మవిశ్వాసం! కంట్రోలు చేయకపోతే ముదిరి ఎన్టీ రామారావయిపోతాడు. ఏదో ఒకటి చేయాలి. ఛాన్సు రాకపోతుందా!

